

భీమవరం కాదు.. నరసాపురానికి

వందే భారత్ ముంగిట కొత్త ప్రతిపాదన

- ప్రస్తుతం విజయవాడ-చెన్నై మధ్య రాకపోకలు
- వాటర్ ఫిల్లింగ్ సమస్యతో పొడిగింపునకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ విజ్ఞప్తి
- సదరన్ రైల్వే ఓకే చెబితే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రాకపోకలు



నరసాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి):వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును జిల్లాకు తీసుకొచ్చేందుకు నేతలు, అధికారులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం చెన్నై-విజయవాడ మధ్య నడుస్తున్న ఈ రైలును ఏడాది క్రితం భీమవరం వరకు పొడిగించాలని ప్రతిపాదించారు. అయితే ఈ రైలు నిర్వహణ కు ఇక్కడ సిబ్బంది, వాటర్ ఫిల్లింగ్‌కు అవసరమైన పైప్‌లైన్‌లు లేకపోవడంతో పెండింగ్ పడింది. ఎలాగైనా సదరన్ రైల్వేను ఒప్పించి నరసాపురం వరకు పొడిగించేందుకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రయత్నిస్తున్నారు. ఏడాదిన్నర క్రితం చెన్నై-విజయవాడ మధ్య 20677 నెంబర్‌తో వందే భారత్‌ను నడుపుతున్నారు. ఇది చెన్నై లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి 11.30కి విజయవాడ చేరుతుంది. తిరిగి 20678 నెంబర్‌తో మధ్యాహ్నం 3.20 గంటల కు బయలుదేరి రాత్రి 9.30కి చెన్నై వెళుతుంది. ఉదయం చెన్నై నుంచి వచ్చి విజయవాడ స్టేషన్‌లో నాలుగు గంటలపా టు ఈ రైలు నిలిచిపోవడం వల్ల ప్లాట్‌ఫారం సమస్య తలెత్తుతోంది. విజయవాడ స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు అధికం కావడంతో ఎక్కువ సేపు వందే భారత్ నిలిచిపోవడం వల్ల ప్లాట్‌ఫారాలు ఖాళీలేక కొన్ని సమయాల్లో కొన్ని రైళ్లను అవుటర్‌లో రెడ్‌సిగ్నల్ ఇచ్చేస్తున్నారు. దీనివల్ల రైళ్లు ఆలస్యానికి కారణమవుతున్నాయి. దీనిని గుర్తించిన రైల్వే ఈ ఎక్స్‌ప్రెస్‌ను పొడిగించాలని నిర్ణయించింది. ఏ స్టేషన్ వరకు పొడిగిస్తే ప్రయాణికుల డిమాండ్ ఉం టుందన్న దానిపై తర్జనభర్జనలు చేశారు. చివరికి భీమవరం స్టేషన్‌ను ఓకే చేశారు. అప్పటికే కొత్తగా డబ్లింగ్ లైన్ వేయడం వల్ల ట్రాక్ సామర్థ్యం సరిపోవడం తో అంతా ఒకే అని భావించారు. అయితే భీమ వరం రన్నింగ్ స్టేషన్, ఇక్కడ రైళ్ల నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది ఉండరు. బోగీలకు నీరునింపే సదుపాయం ఈ స్టేషన్‌లో లేదు. వీటి ఏర్పాటు ఖర్చుతో కూడిన పని, వీటిని అధ్యయనం చేసి ప్రస్తుతం పెండింగ్‌లో పెట్టారు.

మంత్రి జోక్యంతో స్పీడ్

డబ్లింగ్ పనులు పూర్తయిన తరువాత జిల్లా మీదుగా రైళ్ల సంఖ్య పెరగలేదన్న భావన ప్రయాణీకుల్లో ఉంది. అమరావతి ప్రతి శుక్రవారం బెంగళూరు స్పెషల్ మినహా కొత్త రైళ్లు ఏపీ రెండేళ్లలో జిల్లా పట్టాలెక్కలేదు. అన్నీ మచిలీపట్నం, కాకినాడ వైపే తరలిపోతు న్నాయి. చివరికి వందే భారత్ దారి మళ్లుతుం దని గుర్తించిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కొత్త ప్రతిపాదనను తెర మీదకు తీసుకొచ్చారు. భీమవరంలో సాధ్యం కాకపోతే నరసాపురం వరకు పొడిగించాలని రైల్వే మంత్రిని కోరారు. కేవలం అరగంట వ్యవధిలో ఈ రైలు భీమవరం నుంచి నరసాపురం చేరుకుం టుంది. జిల్లాలో నరసాపురం స్టేషన్‌లో రెండు పిట్‌లైన్లు ఉన్నాయి. వాటర్ ఫిల్లింగ్ సదుపాయం ట్రాక్‌లపై ఉంది. వీటితో పాటు ఎన్నో ఏళ్లుగా నరసాపురం నుంచి చెన్నైకు రైలు నడపాలన్న ప్రతిపాదన ఉంది. ఇప్పుడు వందే భారత్‌ను పొడిగిస్తే ఈ హామీ కూడా నెరవేర్చి నట్లు అవుతుందని రైల్వే మంత్రికి, అధికారు లకు వివరించారు. ఇదే ప్రతిపాదనను సద రన్ రైల్వేకు పంపారు. తాజా ప్రతి పాదనకు సదరన్ రైల్వే పచ్చ జెండా ఊపితే వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి జిల్లావాసులకు వందే భారత్ రైలులో ప్రయాణించే ఛాన్స్ దక్కుతుంది.

తండ్రి మందుల కోసం వెళుతూ కొడుకు దుర్మరణం 7



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అస్మి

సీఎం చంద్రబాబు 1న తణుకు రాక !

- లక్ష గృహ ప్రవేశాలకు తణుకులో శ్రీకారం చుట్టే అవకాశం..
- కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్ల పరిశీలన
- పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి వుంది

తణుకు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్ర బాబు ఫిబ్రవరి 1న తణుకులో పర్యటించే అవకాశం వుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష పీఎంఏవై - ఎన్టీఆర్ నగర్ లలో గృహ ప్రవేశాల కార్యక్రమానికి తణుకు నుంచే శ్రీకారం చుట్టే అవకాశాలు ఉన్నట్టు భావిస్తున్నారు. అలాగే పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు సీఎం చేతుల మీదుగా అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే షెడ్యూలు అధికారికంగా ఖరారు కావాల్సి వుంది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం తణుకు, తేతలి, మండపాక పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్‌లలో హౌసింగ్ లే అవుట్లను, తణుకు ఎస్ఎన్‌వీఎం పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని హెలీపాడ్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అధికారులకు పలు సూచనలు చేశారు. వీరి వెంట ఏఎస్పీ వి.భీమారావు, ఆర్డీవో కతీబ్ కౌశల్‌బానో, హౌసింగ్ పీడీ వై.హరనాథ్, తహశీల్దార్ దండు అశోక్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



కొల్లేరు ఏం చేద్దాం ?

నేడు పరిరక్షణ సమావేశం

హాజరు కానున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

కైకలూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి):కొల్లేరు ఆక్రమణలపై సుప్రీంకోర్టులో వరుస ఫిర్యాదులతో కొల్లేరు ప్రజల్లో ఆందోళన మొదలైంది. అరకొర చేపల చెరువు గట్లలో ఉన్న నీటిలో చేపలను పట్టుకొని జీవనం సాగిస్తున్న వారికి ఇది మింగుడుపడని సమస్యగా మారింది. మరికొన్నిచోట్ల వేలాది ఎకరాలు చెరువులుగా మార్చి, దాని నుంచి వచ్చే ఆదాయంతో ఆయా గ్రామాల్లో ప్రజలు పంచుకొని జీవనాధారం పొందుతున్నారు. 2006లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లేరు ఆపరేషన్ పేరుతో వేలాది ఎకరాల చేపల చెరువులను ధ్వంసం చేశారు. అప్పటి నుంచి ఆయా కొల్లేరు గ్రామాల్లోని ప్రజలకు జీవనో పాధి లేక పొట్ట చేతపట్టుకుని పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్లారు. ఇతర ప్రాంతాలకు వెళ్లలేని వారు ఆయా గ్రామా ల్లోని సంప్రదాయ వేటను నమ్ముకొని జీవనం సాగిస్తున్న తరుణంలో మరొకసారి కొల్లేరు సమస్య తెరమీదకు రావడంతో స్థానికులు భయాందోళన చెందుతు న్నారు. మరోసారి ఉన్న చెరువులను ధ్వంసం చేస్తే ఇక ఎప్పటికీ తమకు జీవనోపాధి లభించదని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పటికే అటవీశాఖ అధికారులకు చేపల చెరువులకు గండ్లు పెట్టారు. దీనిపైన మార్చి చివరి నాటికి కొల్లేరు కాంటూరు సరిహద్దులను నిర్ధారించి పూర్తిస్థాయిలో నివేదికలు అందించాలని సుప్రీంకోర్టు కోరడంతో ఈ సమస్య మొదటికి వచ్చింది. దీంతో కొల్లేరు ప్రాంతంలోని నాయకులు స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజల జీవనోపాధికి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో లేక ఉన్న చెరువులను ధ్వంసం చేస్తారో తెలియని అయోమయ పరిస్థితుల్లో కొల్లేరు ప్రజలు కొట్టిమిట్టాడుతున్నారు. వీటి నుంచి తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా కొల్లేరు పరిరక్షణ పేరుతో భారీ బహిరంగసభకు తెరతీశారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం నాలుగు గంటలకు కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో కొల్లేరు పరిరక్షణ సమావేశం జరపనున్నారు.

సమావేశానికి ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, పత్సమట్ల ధర్మరాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కొల్లేరు ప్రముఖ నాయకులు పాల్గొంటారని రాష్ట్ర టీడీపీ వడ్డీ సాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు తెలిపారు. కొల్లేరు సమస్య పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ సమావేశానికి కొల్లేరు లంక గ్రామాల్లోని ప్రజలంతా పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

రూటు మారింది

- ఆకివీడు నుంచి దిగమర్రు వరకు నాలుగు లైన్‌ల రహదారి
- రూరల్ మండలం మీదుగా వెళ్లేలా భీమవరం నుంచి బైపాస్ అలైన్‌మెంట్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం పశ్చిమకు మరో వరం ప్రకటించింది. ఆకివీడు నుంచి దిగమర్రు వరకు 165 జాతీయ రహ దారిని నాలుగు లైన్‌లుగా విస్తరించనుంది. పామర్రు నుంచి ఆకివీడు మీదుగా దిగమర్రు వరకు గత తెలుగు దేశం హయాంలోనే జాతీయ రహదారి మంజూరైంది. పామర్రు నుంచి ఆకివీడు వరకు తొలి దశలో 60 కిలో మీటర్ల మేర రెండు లైన్‌లనే నిర్మించారు. ప్రాజెక్ట్ పూర్తి కావచ్చింది. రెండో దశలో ఆకివీడు-దిగమర్రు వరకు 42 కిలోమీటర్లు నాలుగు లైన్‌లుగా అభివృద్ధి చేయడానికి కేంద్రం అంగీకరించింది. అలైన్‌మెంట్‌కు ఆమోదముద్ర వేసింది. భీమవరం వద్ద రూరల్ గ్రామాల మీదుగా వెళ్లనుంది. ఇప్పటి వరకు అలైన్‌మెంట్‌పైనే సందిగ్ధత ఉంది. భీమవరం బైపాస్ రహదారినే గతంలో అలైన్ మెంట్‌గా నిర్ధారించారు. ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మార్పులు చేశారు. మూడు అలైన్‌మెంట్ లను కేంద్రానికి ప్రతిపాదించారు. భీమవరం రూరల్ మండల గ్రామాలు మీదుగా అలైన్‌మెంట్‌కు కేంద్రం ఆమోదముద్ర వేసింది. ఆకివీడు నుంచి వీరవాసరం వరకు ఆక్వా గ్రామాల మీదుగానే అలైన్‌మెంట్ వెళ తోంది. తాజా ప్రయత్నం వల్ల ఆక్వాతోపాటు భీమవరం ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

12 ప్రాంతాల్లో వంతెనలు

గ్రామాల వద్ద రాకపోకలకు ఇబ్బంది లు లేకుండా 12 ప్రాంతాల్లో వంతెన లు నిర్మించాలని గుర్తించారు. బైపాస్ 29 కిలోమీటర్లు ఉంటుంది. మరో 13 కిలోమీటర్లు ప్రస్తుత రహదారినే నాలుగు లైన్‌లను అభివృద్ధి చేయనున్నారు. ఆకివీడు-వీరవాసరం మధ్యలో బైపాస్ విస్తరించేలా చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం అలైన్ మెంట్‌ను గుర్తించింది. అధికారులు సర్వేలో నిమగ్నమ య్యారు. డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. మార్చిలోగా ఆమోదముద్ర వేస్తారు. టెండర్లు పిలుస్తారు. డీపీఆర్‌ను ఆమోదింప జేస్తే నిధులకు కొరత ఉండదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1,200 కోట్లు కేటాయించింది. మార్చిలోగా డీపీఆర్‌కు ఆమోదముద్ర పడితే నిధులు మనుగడలో ఉంటాయి. లేదంటే మురిగిపోతాయి. ఫలితంగా అధికారులు సర్వేలో నిమగ్నమయ్యారు. సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీ ఆర్)ను సిద్ధం చేయడానికి ప్రణాళిక చేస్తున్నారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే డీపీఆర్ పూర్తి చేయాలన్న సంకల్పం తో జాతీయ రహదారి అధికారులు ప్రయత్నాలు చేస్తు న్నారు. అవసరమైన భూమిని గుర్తిస్తున్నారు. అలైన్‌మెం ట్‌పైనా సందిగ్ధత వీడింది. ఉండి, భీమవరం, పాలకొల్లు నియోజకవర్గాలను కలుపుతూ రెండో దశ 165 జాతీయ రహదారి అభివృద్ధి చెందుతుంది. రహదారి అలైన్‌మెంట్ ఆమోదం విషయంలో కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్‌వర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, భీమవరం ఎమ్మెల్యే అంజిబాబుల పాత్ర ఉంది. మూడు నెలల క్రితమే కేంద్రానికి మూడు అలైన్‌మెంట్‌లు పంపారు. అన్నీ బేరీజు వేసుకున్న కేంద్రం అందులో ఒక అలైన్‌మెంట్‌కు అనుమతి ఇచ్చింది. అదే భీమవరం పట్టణానికి దిగువ ప్రాంతం నుంచి అంటే రూరల్ మండల గ్రామాల మీదుగా రహదారి వెళుతుంది.



ఆక్వాకు జోష్

ఈ రహదారి నిర్మాణం వల్ల ఆక్వా రంగం మరింత అభివృద్ధి చెందుతుంది. ఆక్వా ప్రాజెక్టులకు అనువుగా ఉంటుంది. భీమవరం, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల ప్రజల రాకపోకలకు మరింత మేలు జరుగుతుంది. భీమవరం పట్టణానికి పూర్వ వైభవం రానుంది. జిల్లాకు ఆర్థిక రాజధాని భీమవరం అంటూ అంతా చెప్పుకొనేవారు. గత ఐదేళ్లలో పెద్దగా అభివృద్ధి చెందలేదు. జాతీయ రహదారి నిర్మాణం వల్ల జిల్లా కేంద్రంగా రూపు రేఖలు మారిపోనున్నాయి.

ఏ షాపు.. ఎవరికి ?

- కులాల వారీగా గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు
- లాటరీ ద్వారా ఎంపిక చేసిన కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గీత కార్మికులకు కులాల వారీగా 18 మద్యం షాపులను కేటాయించారు. ప్రాంతాల ఎంపికను లాటరీ పద్ధతిలో కలెక్టర్ నాగరాణి ని ర్వహించారు. జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం జరిగిం ది. కలెక్టర్ లాటరీ పద్ధతిలో టోకెన్ తీసి ప్రాం తాలను ఎంపిక చేశారు. జిల్లాలో శెట్టిబలిజకు 10, గౌడకు 5, గౌడ్‌కు 2, శ్రీశైయన ఒక షాపు చొప్పున 18 కేటాయించారు. మునిసిపల్ ప్రాంతాలైన భీమవరం - శెట్టిబలిజ, తణుకు - శెట్టిబలిజ, తాడేపల్లిగూడెం - గౌడ, నరసాపురం - శెట్టిబలిజ, ఆకివీడు నగర పంచాయతీ - శెట్టిబలిజ, ఆకివీడు రూరల్ - గౌడ్, గణపవరం - గౌడ్, అత్తిలి - శ్రీశైన, ఇరగవరం - గౌడ, నరసాపురం రూరల్ - శెట్టిబలిజ, వీరవా సరం - గౌడ, ఆచంట - శెట్టిబలిజ, తాడేపల్లిగూడెం రూరల్ - గౌడ, మొగల్తూరు - శెట్టిబలిజ, పెనుగొండ - శెట్టిబలిజ, తాడేపల్లిగూడెం రూరల్ - శెట్టిబలిజ, తణుకు రూరల్ - శెట్టి బలిజ, పెనుమంట్ర - గౌడ, పోడూరు - శెట్టి బలిజ కులాలకు లాటరీ పద్ధతి ద్వారా రిజర్వు చేశారు. ఈ నెల 26న గెజిట్ నోటిఫికేషన్ విడు దల చేసి, 27 నుంచి దరఖాస్తు స్వీకరిస్తారు. ఆన్‌లైన్, హైబ్రిడ్ విధానాల ద్వారా రూ.2 లక్షలు దరఖాస్తు రుసుం చెల్లించాలి. దరఖాస్తు గడువు వచ్చే నెల 5వ తేదీ. 6న పరిశీలన, 7 ఉదయం పది గంటలకు లాటరీ పద్ధతి ద్వారా దరఖాస్తుదారులను ఎంపిక చేసి షాపులు కేటా యిస్తారు. అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ కేఎస్‌వి ప్రభుకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుమ రేశ్వరన్, బీసీ వెల్ఫేర్ అధికారి గణపతిరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి .ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.






ప్రాథమిక పాఠశాలల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి

- 60 మందికిపైగా విద్యార్థుల తరగతికి ఒక టీచర్‌తో బోధన ఇచ్చేలా ఆలోచన
- గత ప్రభుత్వం చేసిన విలీన స్కూళ్లపై మార్పునకు పరిశీలన
- టీచర్లు పెరిగే అవకాశం

7

మంచు కురిసే వేళలో..



శుక్రవారం ఉదయం.. మంచులోనే పనులకు వెళుతున్న మహిళా కూలీలు

ఓటు మాటున తలరాతలు

నేడు ఓటర్ల దినోత్సవం



నాయకులను గద్దె నెక్కించాలన్నా.. ప్రభుత్వాలను కూల్చాలన్నా.. ఓటుతోనే సాధ్యం

భీమవరం టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఓటు ఒక వజ్రాయుధం. ప్రజాస్వామ్యాన్ని నిల బెట్టే మూలస్తంభం. ఓటరు తలచుకుంటే ప్రభు త్వాలను మార్చేస్తాడు. నాయకుల తల రాతల ను రాసేస్తాడు. మనం ఈ రోజు ప్రశాంతంగా, ధైర్యంగా ఓటు వేస్తున్నామంటే.. దీనికి ప్రధాన కారకుడు నాటి భారత ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్. ఓటు విలువను తెలియజేయడం తోపాటు ఎన్నికల సంఘం అంటే ఎలా ఉండా లో చేతల్లో చూపించిన గొప్ప వ్యక్తి. ఆయన చూపిన మార్గం ద్వారా నేడు ఓటు హక్కు విలువ పెరగటంతోపాటు, స్వచ్ఛందంగా ఓటు ను వేస్తున్నారు. ఈసారి ఇంటి నుంచి బయట కు రాలేని వారికి ఎన్నికల సంఘం ఇంటి వద్ద నే ఓటు హక్కు వేసే విధానాన్ని తెచ్చి ఫలితా లను సాధించింది. ఓటర్లకు ఓటు విలువను తెలియజేస్తూ.. యువతకు ఓటు హక్కు కల్పిం చేలా ఎన్నికల సంఘం అవగాహన కల్పిస్తోంది. ఈ క్రమంలోనే ఏటా జనవరి 25న ఓటరు దినో త్సవం చేసుకుంటున్నాం. 2011 నుంచి కేంద్ర ఎన్నికల సఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఓటర్ల జాబితా ప్రకారం జిల్లావ్యాప్తంగా మహిళా ఓటర్లే ఎక్కు వ. ఓటర్ల జాబితా సవరణ తర్వాత జిల్లా అధి కారులు ప్రకటించిన వివరాల ప్రకారం జిల్లాలో 14,70,852 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,20,597 మంది, మహిళలు 7,50,179 మంది ఉన్నారు. ఏడు నియోజకవ ర్గాల్లో మహిళా ఓటర్లే అత్యధికం. భీమవరంలో ఏడు వేల 418 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలాగే పదేళ్లలో యువత ఎక్కువగా ఓటు హక్కు వినియోగించుకుంది. వచ్చే ఐదేళ్ల తర్వాత ఓటు హక్కు పొందే వారిని గుర్తించి పాఠశాలల స్థాయిలోనే ఫారం-16 పూరించి తీసుకునే విధానానికి శ్రీకారం చుడుతున్నారు. ఓటరు దినోత్సవాన్ని జిల్లాస్థాయిలో కలెక్టరేట్‌లో సీనియర్ ఓటర్‌ను స త్కరిస్తారు. కొత్త ఓటర్లకు కార్డులు అందిస్తారు.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆచంట	88,747	91,038	02	1,79,787
పాలకొల్లు	95,680	99,225	08	1,94,913
నరసాపురం	84,764	85,919	00	1,70,683
భీమవరం	1,22,394	1,29,812	49	2,52,255
ఉండి	1,10,334	1,14,681	02	2,25,017
తణుకు	1,14,272	1,19,979	05	2,34,256
తాడేపల్లిగూడెం	1,04,406	1,09,525	10	2,13,941
మొత్తం	7,20,597	7,50,179	76	14,70,852

తొలిసారి ఓటు వేశా

ఈ మధ్య కొత్తగా ఓటు హక్కు వచ్చింది. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో దీనిని వినియోగించుకున్నా. తొలిసారి కావడంతో ఇది ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. మన నాయకులను మనమే ఎన్నుకునే ఈ పద్ధతి ప్రజాస్వామ్యంలో మాత్రమే సాధ్యం. ఎవరిని అధికారంలోకి తీసుకురావాలి ? ఎవరిని గద్దె దించాలి అనేది ఓటు హక్కుతోనే సాధ్యం. మనలను ఎవరు పాలించాలో మనమే నిర్ణయించేలా ప్రతి ఒక్కరూ ప్రతి ఎన్నికల్లోనూ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలి.

- వాడపల్లి మాధవి, మాముడూరు

ఓటు.. మన జన్మహక్కు

ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతీ ఎన్నికల్లోను ఓటు వేశాను. ఓటు హక్కు వినియోగం జన్మహక్కుగా భావించాలి. తల్లితండ్రులు పిల్లలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి. ఎన్నికల సంఘం మరింత కఠినంగా ఉంటే మరిన్ని మంచి ఫలితాలను ప్రజలకు అందించే వీలుంటుంది.

సత్యనారాయణమూర్తి, అడ్వకేట్

మంచు ముసుగు

తెల్లారి 9 దాటినా మంచు ముసుగు తొలగడం లేదు.. రెండు రోజులుగాపొగ మంచు దట్టంగా కమ్మేస్తోంది.. మంచు తీవ్రతతో దారులు కనిపించని పరిస్థితి ఏర్పడింది. మంచుతో పాటు చలి చంపేస్తోంది. మంచు ఎక్కువగా ఉండటంతో ఉదయం పంట పొలాలకు వెళ్ళే కూలీలు, పాలు తీయటానికి పొలాలకు వెళ్ళే రైతులు స్కూళ్లకు వెళ్లే చిన్నారులు ఇబ్బందుల పడ్డారు.. ద్వారకాతిరుమలలో క్షేత్ర పరిసరాలు మంచుతో కప్పేశాయి..



మంచులోనే ప్రయాణం

↑ భీమవరం →





స్కూల్ టైమ్ అయినా మంచు వదల్లేదు..





వ్యవసాయ పనుల్లో రైతులు



ఇంకా తెలవారలేదే : ద్వారకాతిరుమల కొండపై..



ఆకివీడులో మంచుతెరలను చీల్చుకువస్తున్న ఉదయభానుడు



ఏలూరు శివారులో పనికి వెళ్లే హడావుడి





హ్యాండ్ బాల్ పోటీల పోస్టర్లు విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య

30 నుంచి అంతర కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీలు

దెందులూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, తూర్పుగోదావరి గుంటూరు, ప్రకాశం ఏడు జిల్లాల పరిధిలోని కళాశాలల హ్యాండ్ బాల్ పోటీలను ఈనెల 30 తేదీ నుంచి వేగవరంలోని హేలాపూడి ఇంజినీరింగ్ కాలేజీలో జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లావణ్య తెలిపారు. జనవరి 30 నుంచి 31వ తేదీ వరకు బాలుర విభాగంలో 25 టీంలు, బాలికల విభాగంలో 11 టీంలు పాల్గొంటాయని తెలిపారు. శుక్రవారం వేగవరం కాలేజీలో పోటీలకు సంబంధించి కరపత్రాలను కళాశాల ఏవో కరుణానిధి, ఉపాధ్యాయులు విడుదల చేశారు,

వెయిట్ లిఫ్టర్ కార్తీక్‌కు గవర్నర్ తేనీటి విందుకు ఆహ్వానం



ఏలూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు యువ వెయిట్‌లిఫ్టర్ అంబళ్ల కోమలి కార్తీక్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 26న విజ యవాడలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఎట్‌హోమ్ సందర్భంగా ప్రముఖులకు సాయంత్రం ఇచ్చే తేనేటి విందుకు రావాలని రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందింది. ఇటీవల కాలంలో 96 కిలోల విభా గంలో కార్తీక్ జూనియర్ నేషనల్స్ వెయిట్ లిఫ్టింగ్‌లో స్వర్ణం, సీనియర్ నేషనల్స్‌లో రజతం వశం చేసుకున్నాడు. ప్రస్తుతం పంజాబ్‌లో ఎంబీఏ చదువుతున్నాడు. నగరంలోని కొత్త పేటకు చెందిన కార్తీక్ ఇండోర్ స్టేడియంలోని డీఎస్‌ఏ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఇప్పటివరకు 30కు పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కార్తీక్ పతకాలను వశం చేసుకున్నాడు. డీఎస్‌డీవో శ్రీని వాసరావు, రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సెక్రటరీ బడేటి వెంక ట్రామయ్యలు కార్తీక్‌ను అభినందించారు. గవర్నర్ నుంచి తనకు ఆహ్వానం రావడం ఆనందంగా ఉందని కార్తీక్ చెప్పాడు.

పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాల లైటింగ్ టెండరు ఖరారు

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో విద్యుద్దీపాలంకరణ టెండర్లను శుక్రవారం ఖరారు చేశారు. పట్టిసీమ పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి గూటాల పంచాయతీ కార్యాలయంలో వచ్చిన టెండర్లను పరిశీలించి ఖరారు చేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్లలో ముగ్గురు పాల్గొనగా ఒకరు విత్ డ్రా అయ్యారని, రూ.1,49,000లకు టెండరు వేసిన మంద పాటి రాజు అనే వ్యక్తికి టెండరు ఖరారు చేసినట్టు కార్యదర్శి తెలిపారు.



టెండర్లు కార్యక్రమంలో అధికారులు

గోదావరిలో మత్స్య సంపద కోసం చేప పిల్లల విడుదల

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిలో చేప పిల్లల సీడ్‌ను విడు దల చేసినట్టు మత్స్యశాఖ జిల్లా అధికారి జేఎస్‌ఈ నాగ లింగాచార్యులు తెలిపారు. మత్స్య సంపద అభివృద్ధి ద్వారా మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని అందులో భాగంగా చేప పిల్లలను గోదావరిలో వదిలి నట్టు తెలిపారు. పోలవరం, గూటాల గ్రామాల్లో 20 లక్షల చేప పిల్లల సీడ్‌ను గోదావరిలో విడుదల చేయగా, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో పోగొండ, జల్లేరు జలాశయాల్లో 1.20 లక్షల చేప పిల్లల సీడ్ విడుదల చేసినట్టు తెలిపారు. కూటమి నాయకులు జల్లేపల్లి రాజా, బ్యాటరీ పోశి, మిరియాల అంజిబాబు,మత్స్యకార సొసైటీ నాయకులు వెంకట్రావు, అచ్చారావు పాల్గొన్నారు.



గోదావరిలో చేప పిల్లలు వదులుతున్న నాయకులు



సురభి వేణుగోపాలరావును సన్మానిస్తున్న ఎంపీపీ హరినారాయణరాజు, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు నడింపల్లి సత్యవతి రామకృష్ణంరాజు, ఆలయ కమిటీ చైర్మన్ బదిరీనారాయణరాజు తదితరులు

సురభి నాటకాలు మరిచిపోలేం..

ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

ఉండి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సురభి నాటకాలను ప్రదర్శించిన తీరు తాము మరువలేమని ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. గురువారం రాత్రి ఉండి మండలం కోలమూరులో సురభి నాటక సంస్థ దర్శకుడు, నటుడు వేణుగోపాలరావు, ఆయన బృందాన్ని ఘనంగా సన్మానించారు. కళాకారుల తమ సహజ నటనతో ప్రేక్షకులను మైమరిపించారన్నారు. కోలమూరు విచ్చేసి ప్రదర్శించిన నాటకాలను మరిచిపోలేమన్నారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ అంతరించిపోతున్న నాటకాలకు మరోసారి జీవం పోసిన ఉండి-కోలమూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉండి ఎమ్మెల్యే, ఉపసభాపతి కనుమూరు రఘు రామ కృష్ణరాజుకు ధన్యవాదాలు తెలిపారు. భీమవరం మున్సి పల్ మాజీ చైర్మన్ బొమ్మిడి నారాయణరావు, నరసాపురం పార్లమెంటు బీజేపీ కన్వీనరు పేరిచర్ల సుభాష్‌రాజు, నరసరాజు, యువరాజు, రుద్రరాజు రవికుమార్ రాజు, నంబూరి బలరామరాజు, పేరిచర్ల శ్రీనివాసరాజు, అప్పలరాజు, రుద్రరాజు నరసింహరాజు, కెవి రాజు, ముదునూరి సతీష్‌రాజు, ఆలయ కమిటీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

పర్యాటకం పరవశం..

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

పర్యాటకం అంటే మనసుకు ఆహ్లాదం.. ప్రశాంతతను ఇచ్చే ప్రాంతాలను సందర్శించడం.. చాలామంది ప్రతీ ఏడాది ఏదో ఒక ప్రాంతానికి వెళుతుంటారు..అది ఆధ్యాత్మిక ప్రదేశమైనా, పర్యాటకమైనా.. ఏదైనా ఆనందం కోసమే.. పిల్లలకు ఆటవిడుపుగా, పెద్దలకు మనశ్శాంతిని అందించే ప్రదేశాలు ఎన్నో ఉంటాయి.. నేడు జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పలువురు పర్యాటక ప్రేమికులు తమ అనుభవాలను వివరించారు..





కేదారనాథ్‌లో కుటుంబంతో కలిసి ఆకుల నాగు

• అన్నీ చుట్టేయాలన్నదే నా లక్ష్యం

మన మనసును ఉత్తేజపరిచే స్థలాలు సందర్శించడం ఓ అనుభూతి నిస్తుంది. ఉల్లాసంగా..ఉత్సాహంగా గడపాలంటే టూర్ వేయాల్సిందే.. ఎక్కడ చూడదగ్గ స్థలం ఉన్నా అక్కడికి వాలిపోయే వారిలో తాడేపల్లిగూడేనికి చెందిన ఆకుల నాగు కుటుంబం ముందుంటుంది. దేశంలో చూడతగ్గ స్థలాలతో పాటు విదేశాలను కూడా చుట్టి వస్తుంటారు. ఒకసారి స్నేహితులతో మరోసారి కుటుంబంతో ఇలా అన్ని ప్రాంతాలు చుట్టేయడమే కాదు. అక్కడ విశేషాలను సోషల్ మీడియాలో స్నేహితులతో పంచుకుంటూ మనం కూడా ఆ ప్రాంతానికి వెళ్లాలనిపించేలా చేస్తుంటారు. ఫ్యామిలీ అంతా స్వీట్స్ బిజినెస్‌లో తలమునకలు అవుతుంటుంది. "తాతారావు స్వీట్స్ అంటే తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల వారికి ఎంత ఇష్టమో నాకు పర్యాటక ప్రాంతాలు చూడటమంటే అంతే ఇష్టం. దైనందిన జీవితంలో పడి మునిగిపోవడం నాకు అసలు ఇష్టముండదు. ప్రపంచంలో అన్ని పర్యాటక ప్రదేశాలు వీక్షించాలన్నదే నా లక్ష్యం." అని చెప్పారు.

- తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)

• ఏటా రెండు సార్లు టూర్

నిత్యం వృత్తి, వ్యాపారాలతో సతమతమయ్యే జీవితంలో కాస్తంత ప్రశాంతత కోసం సంవత్సరంలో కొన్ని రోజులు క్షేత్రాలను సందర్శించడం అలవాటుగా మారిందని సన్నిది చంద్ర భగవాన్ చెబుతున్నారు.ఈయన తణుకులో కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు వెళ్లాలని ఆసక్తి ఉన్నప్పటికీ పిల్లలు చదువులు కారణంగా వెళ్లలేకపోయేవారమని ఇప్పుడు ప్రతీ ఏడాది ఏదో ఒక ప్రాంతానికి వెళ్లడం అలవాటు చేసుకున్నాం. రెండేళ్లుగా ప్రతీ సంవత్సరం మార్చి, ఆగస్టు నెలలో రాష్ట్రంలోని పలు అధ్యాత్మిక ప్రదేశాలతో పాటు దేశంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన ప్రదేశాలను సందర్శిస్తాం. భార్యతో కలసి రాష్ట్రంలోని తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడతో పాటు దేశంలోని వారణాసి, ప్రయాగరాజ్, అలహాబాద్, అయోధ్య, రామేశ్వరం, తంజావూరు, భువనేశ్వర్ , మహబలిపురం, శబరిమలై వంటి పుణ్య క్షేత్రాలను సందర్శించా... కాశీ ఇప్పటి వరకూ 8 సార్లు వెళ్లాం. మహబలిపురంలో ఏకశిలా రథాలు, అలహాబాద్‌లోని శక్తి పీఠం, మధుర మీనాక్షి ఆలయం, వరద రాజస్వామి దేవాల యంలో వెండి, బంగారు బల్లులు, భువనేశ్వర్‌లోని లింగరాజస్వామి ఆలయం చూడదగ్గ ప్రదేశాలని భగవాన్ తన అనుభవాలను చెప్పారు..

- తణుకు రూరల్, (ఆంధ్రజ్యోతి)



వారాణసీలోని రాధాకృష్ణ మందిర్ వద్ద భగవాన్ దంపతులు

• చార్‌థామ్ యాత్ర అద్భుతం

పాలకొల్లు పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త, చిన్నగోపురం మాజీ చైర్మన్ గాదె వెంకన్న ప్రతీ ఏటా ప్రకృతి అందాలు తిలకించడానికి పలు ప్రాంతాలకు వెళుతుంటారు. మన దేశంలో పర్యాటక కేంద్రాలకు లోటు లేదని తాను తిరిగిన ప్రాంతాల్లో అమితంగా నచ్చిన యాత్ర చార్ దామ్ అని అని చెప్పారు. ఈ యాత్రలో ఆధ్యాత్మికత, ఆనం దం, ఆహ్లాదం పంచింది. పర్వత ప్రాంతాలను, అటవీ ప్రాంతాలను, జలపాతాలను కలుపుతూ సాగే యాత్ర ఎంతో అద్భుతంగా, ఆశ్చర్యకరంగా ఉంటుంది.

పాలకొల్లు అర్బన్, (ఆంధ్రజ్యోతి)



23 కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేసి కేదార్‌నాథ్ వెళ్లిన గాదె వెంకన్న

• ఏడాదిలో మూడు నెలలు యాత్రలో..



"ఆధ్యాత్మిక యాత్రలు చేస్తుంటే భక్తిలో పరవశమై ప్రాణం హాయిగా ఉంటుంది.. కుటుంబ సభ్యులు స్నేహితులతో కలిసి సంవత్సరంలో మూడు నెలలు యాత్రలు చేస్తాం. జ్యోతిర్లింగాల యాత్ర నెల రోజులు సమయం పడుతుంది. సెల్‌ఫోన్లు వదిలేసి భగవంతుడ్ని స్మరిస్తూ ఉంటే ప్రాణం ఎంతో హాయిగా ఉంటుంది. శ్రీశైలం, షిరిడీ, తిరుపతి ఎక్కువుగా వెళ్తుంటాం. బదరీనాథ్, కేదార్‌నాథ్ వంటి ప్రదేశాలకు వెళితే ఆత్మజ్ఞానంతో పాటు ఆనందం కలుగుతుంది.." అని తణుకు చెందిన వినుకొండ నరసింహమూర్తి చెప్పారు

ఇరగవరం,(ఆంధ్రజ్యోతి)

ఆధ్యాత్మిక ఆనందం..మనసుకు ప్రశాంతత

ఆ ప్రాంతానికి వెళ్తే చాలు మనసులో ఎంత ఒత్తిడి, ఒడిదుడుకులున్నా వెంటనే మర్చిపోతాం. అక్కడ ఆధ్యాత్మికత వాతా వరణంతో పాటూ అహ్లాదం కూడా లభిస్తుంది. పెంటపాడు మండలం కే.పెంటపాడులో భైరాగిమఠం గోపాలస్వామి ఆలయం ఆహ్లాదకరమైన వాతావరణంతో మనసులను రంజింపజేస్తుంది. 18వ శతాబ్దం మొదట్లో ఒడిశా భైరాగి బ్రహ్మచారులచే వైష్ణవ రామానంద సంప్రదాయం ప్రకారం ఈ ఆలయం స్థాపించబడింది ఈ మఠానికి నూజివీడు జమీందారు రాజ వెంకట అప్పారావు బహదూర్ 10 పుట్లు భూమిని (100 ఎకరాలు) బహుమతిగా అందజేశారు. కాశి నుంచి రామేశ్వరం వెళ్ళే భక్తులకు సేద తీరేందుకు, వారికి భోజనవసతులు సమకూర్చేందుకు ఈ మఠం ఉండేదని చెబుతారు. బాలకృష్ణుడు చిన్ని కృష్ణుని అవతారంలో దర్శనమిస్తాడు. ఈ ప్రాంగణంలో అడుగు పెట్టగానే ప్రశాతం వాతావరణం కనపడుతుంది. కాళీయ మర్ధనుడి రూపంలో ఉన్న కృష్ణుడి విగ్రహంతో కోనేరు ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఆలయం లోపలికి అడుగు పెట్టగానే తొలుత గోమాత దర్శనమిస్తుంది. ఆలయం లోపల దశా వతారాల విగ్రహాలు కనువిందు చేస్తాయి.

-పెంటపాడు (ఆంధ్రజ్యోతి)



స్కేటింగ్‌లో జెస్సీకి పతకాల పంట

దెందులూరు,జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కృషి పట్టుదల, నిరంతర సాధన ఉంటే ఉన్నత స్థానాలకు చేరవచ్చని నిరూపించి నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది జెస్సీ ఏలూరు జిల్లా దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన స్కేటర్ జెస్సీ రాజ్ రాష్ట్రపతి దౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకుంది. జోగన్నపాలెం గ్రామానికి చెందిన మాత్రపు సురేష్, రాధ దంపతుల కుమార్తె జెస్సీ విజయవాడ ఎస్‌ఎంఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చిన్ననాటి నుంచి స్కేటింగ్‌పై ఆమెకున్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు కోచ్ సింహాద్రి వద్ద శిక్షణ ఇప్పించారు. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో స్కేటింగ్‌లో 50 పతకాలను సాధించింది. ఈ సంవత్సరం ఆసియా కప్ ప్రపంచకప్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచింది. న్యూజిల్యాండ్‌లో జరిగిన ప్రపంచ ఓషియానా పసిఫిక్ కప్ చాంపియన్ షిప్ -2024 పోటీల్లో పాల్గొని దేశానికి బంగారు పతకాన్ని సాధించింది. ఆమె ప్రతిభను గుర్తించిన ఏపీ ప్రభుత్వం ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2025కు సిఫార్సు చేసింది. డిసెంబరు 26న భారత రాష్ట్రపతి కార్యాలయంలో రాష్ట్రపతి దౌపది ముర్ము జెస్సీరాజ్‌కు అవార్డు అందజేయగా ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు.తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ శిక్షణతోనే ఈ విజయం సాధించినట్టు జెస్సీ రాజ్ తెలిపింది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, జోగన్నపాలెం సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రావు, పసుమర్తి మధుబాబుతో పాటు పలువురు జెస్సీని జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా అభినందించారు,



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న జెస్సీ రాజ్.. ప్రధాన మంత్రి మోదీతో.. (ఫైల్)



దువ్వలో పురుగు మందులు వెదజల్లే డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ ధనరాజు, చీర్ల రాధయ్యలు

యంత్రాలతో సాగు ఖర్చులు తగ్గించాలి

తణుకు రూరల్, జనవరి 24, (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో యంత్రాల వినియోగం ద్వారా ఖర్చులు తగ్గి లాభసాటిగా చేసుకోవాలని ఎంపీపీ రుద్ర ధనరాజు చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో డ్రోన్ సహాయంతో పురుగు మందుల పిచికారీ పనులను ప్రారంభించారు. వైసీపీ నాయకుడు చీర్ల రాధయ్య, గ్రామ టీడీపీ అధ్యక్షుడు శిరిగిశెట్టి వెంకటేశ్వరరావు, ఏవో కుసుమ, డ్రోన్ ఆపరేటర్లు మద్దూరి లక్ష్మణ్, నారాయుడు, మద్దూరి రాంబాబు, ఇతర వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



యమునాపల్లిలో ఐదు తరగతుల విద్యార్థులకు ఒకేసారి విద్యాబోధన చేస్తున్న టీచర్



దిరుసుమర్రులో విలీనమైన పాఠశాల

ఎలిమెంటరీ స్కూళ్ల బలోపేతానికి

ప్రభుత్వం దృష్టి

- 60 మందికిపైగా విద్యార్థుల తరగతికో టీచర్‌తో బోధన ఇచ్చేలా ఆలోచన
- గత ప్రభుత్వం చేసిన విలీన స్కూళ్లపై వచ్చే విద్యా సంవత్సరంలో మార్పునకు పరిశీలన
- పశ్చిమ జిల్లాలో 952 స్కూళ్లకు 1,892 ఉపాధ్యాయులు.. మార్పు జరిగితే టీచర్లు పెరిగే అవకాశం

భీమవరం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఎలిమెంటరీ బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్టు కనిపిస్తుంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు బోధన కూడా ప్రణాళికగా జరగాలనే ఆలోచనలు చేస్తుంది. ఎలిమెంటరీ పాఠశాలల్లో విద్యావిధానం మార్పులపై పరిశీలన మొదలుపెట్టింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాలు తీసుకురావడానికి ఇప్పటి నుంచే విధివిధానాలను విద్యాశాఖాధికారులు తెలిపేలా ఆదేశాలు జారీ చేసింది. పశ్చిం గోదావరి జిల్లాలో 952 ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూళ్ళు ఉన్నాయి. వాటిలో 1,892 మంది ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 20లోపు విద్యార్థులు ఉండడం, ఒకే ఉపాధ్యాయుడు బోధనకు ఉండాల్సి వస్తుంది. దీంతో విద్యాబోధన ఐదు తరగతులకు ఒక ఉపాధ్యాయుడే చెప్పడం కొంత ఇబ్బందికరమైన విషయంగా పరిగణనలోకి ప్రభుత్వం తీసుకున్నట్టే కనిపిస్తుంది. దీనిలో భాగంగానే 60 మంది విద్యార్థులు పైబడి ఉన్న పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన ప్రణాళికాబద్ధంగా సాగించాలనే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. దీని వల్ల అదనపు ఉపాధ్యాయులను భర్తీ చేసే అవకాశం ఉండడంతో మెగా డీఎస్సీ ద్వారా వాటిని భర్తీ చేసుకునేందుకు కూడా వీలుంటుంది.

యథావిధిగా గత విలీన పాఠశాలలు..

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 123 పాఠశాలలు విలీన బాట పట్టించారు. వాటిలో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులు ఆ పాఠశాలలకు సమీపంలో ఉన్న హైస్కూల్‌లో బోధన చేసేలా ఏర్పాట్లు చేశారు. దాదాపుగా మూడు వేల మంది విలీనబాటలో ప్రభుత్వ హైస్కూళ్లలోకి వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలో పాఠశాలలు దూరమవుతున్నాయన్న ఆలోచనతో విద్యార్థుల తల్లిదండ్రులు కొన్నిచోట్ల నిరసనలు వ్యక్తం చేశారు. అయినప్పటికీ విలీనంలో వెనకడుగు వేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం విలీనమైన పాఠశాలలను గతంలో మాదిరిగా నిర్వహించేలా పరిశీలన మొదలు పెట్టింది. విద్యార్థుల తల్లిదండ్రుల ఆలోచన ఎలా ఉందన్న దానిపై కూడా వివరాలు సేకరించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాత తరహాలో విలీనమైన పాఠశాలలను నడిపించేలా అడుగులు వేస్తుంది.

వెళ్లిన వారిని వెనక్కి తీసుకురావాలి

ప్రభుత్వ పాఠశాలల్లో గడిచిన ఐదేళ్లలో విద్యార్థుల సంఖ్యలో వెనుకబడుతూ వచ్చాయి. జిల్లాలోని 1,375 పాఠశాలల్లో ఐదేళ్ల క్రితం లక్షా 38 వేల మంది విద్యార్థులు ఉండేవారు. ఈ విద్యా సంవత్సరం లెక్క ప్రకారం లక్ష మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. అంటే 38 వేల మంది ప్రైవేట్ బాట పట్టారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు తీసుకువచ్చి వెళ్లిపోయిన విద్యార్థులను తిరిగి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చేలా ప్రభుత్వం ఆలోచనలు చేస్తుంది.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త నిర్ణయాలు !

ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలలపై పరిశీలన జరుగుతుంది. ఏ పాఠశాల ఎంత దూరం ఉన్నది, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు. అనేవి పూర్తి వివరాలు తీసుకుంటున్నాం. గతంలో విలీనమైన పాఠశాలలపై కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచనపై కూడా పరిశీలన చేస్తాం. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త నిర్ణయాలు ఉండే అవకాశం ఉంది.

- నారాయణ, డీఈవో, పశ్చిమ గోదావరి జిల్లా

శ్రీవారి ఆలయ పాలక మండలికి వీడ్కోలు

- వైసీపీ సభ్యులతో ముగిసిన ట్రస్టు బోర్డు చివరి సమావేశం
- ఫిబ్రవరి 8వ తేదీతో పాత పాలకమండలి రద్దు
- నూతన పాలక మండలికి కూటమి నేతల ప్రయత్నాలు





చివరి సమావేశంలో పాల్గొన్న వైసీపీ పాలకమండలి సభ్యులతో ట్రస్టీ, ఈవోలు

ద్వారకాతిరుమల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి శేషాచల కొండపై శుక్రవారం గత వైసీపీ ప్రభుత్వం నియమించిన సభ్యులతో చివరిసారిగా ట్రస్టు బోర్డు సమావేశం జరిగింది. ప్రస్తుతం ఉన్న పాలక మండలి 2023 ఫిబ్రవరి 9న 16 మంది ధర్మకర్తలతో ఏర్పడింది. ఆలయ అనువంశిక ధర్మకర్త రాజా ఎస్వీ సుధాకరరావు చైర్మన్‌గా, ఆలయ ప్రధాన అర్చకులు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాధాచార్యులు ఎక్స్ అఫీషియో సభ్యునిగా, అప్పటి ప్రభుత్వ నియమించిన మరో 14 మంది సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కూటమి ప్రభుత్వ ఏర్పడి దాదాపు ఏడాది కావస్తున్నా పదవుల నుంచి వైదొలగలేదు. చైర్మన్‌గా వ్యవహరిస్తున్న అనువంశిక ధర్మకర్త, ఎక్స్ అఫీషియో సభ్యుడు మినహా మిగిలిన 14 మంది ప్రభుత్వం మారినా ట్రస్టీలుగానే నామినేటెడ్ పదవుల్లో ఉన్నారు. అటు దేవస్థానం ఇటు ప్రస్తుత కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు.

వైసీపీ హయాంలో రెండు సార్లు ట్రస్టు బోర్డు..

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన క్రమంలో వైసీపీ హయాంలో నామినేటెడ్ పదవులు పొందిన పలువురు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వైసీపీ పాలనలో శ్రీవారి దేవస్థానానికి రెండుసార్లు పాలకమండలి నియామకాలు జరిగాయి. ఆలయానికి 14 మంది సభ్యులతో 2011లో తొలిసారిగా ఏర్పాటైన ట్రస్టు బోర్డు 2013 వరకు కొనసాగింది. ఆ తరువాత చట్టపరిధిలోని అంశాలకు లోబడి అప్పటి ప్రభుత్వం ఐదేళ్లపాటు ట్రస్టుబోర్డు నియామకం జరుగకుండా మినహాయింపునిచ్చింది. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొదటిసారి 2020 ఫిబ్రవరి 20న శ్రీవారి దేవస్థానానికి ట్రస్టు బోర్డును నియమిస్తూ అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి రెండేళ్లపాటు వారు విధులు నిర్వర్తించారు. అనంతరం నియామకాలు జరుగకపోవడంతో ఆ బోర్డు పదవీకాలాన్ని పొడిగించారు. మరోసారి 2023 ఫిబ్రవరి 9న 16 మంది ధర్మకర్తలతో పాలకమండలి ఏర్పడింది. ప్రస్తుతం వున్న పాలక మండలికి 2025 ఫిబ్రవరి 8 వరకు గడువు ఉండడం గమనార్హం.

పాలకమండలి సభ్యులకు వీడ్కోలు

శేషాచల కొండపై ట్రస్టుబోర్డు సమావేశం పూర్తయిన తర్వాత నామినేటెడ్ పదవుల్లో ఉన్న 14 మంది పాలక మండలి సభ్యులకు వీడ్కోలు పలికారు. వారందికీ శ్రీవారి శేషవస్త్రాలను, స్వామి అమ్మవార్ల చిత్ర పటాలు, ప్రసాదాలను ఆలయ చైర్మన్ సుధాకరరావు, అనువంశిక ధర్మకర్త నివృతరావు, ఈవో వేండ్ర త్రినాథరావు అందించారు.

కూటమి నేతల ప్రయత్నాలు

కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూర్పుతో నూతన పాలకమండలిలో చోటు కోసం ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఆలయం అంటే ఆధ్యాత్మికత అని మర్చిపోయి కొందరు ట్రస్టుబోర్డు సభ్యులు హడావుడి చేశారు. స్వామి సేవ చేసుకునే భాగ్యం కోసం ఎందరో తపిస్తుంటారు. గత పాలకమండలిలో నియమితులైన ఓ వ్యక్తి ఇది తన హోదాకు తగినది కాదని రాజీనామా చేసి మరో పదవి కొట్టేశారు. సెక్షన్ 18, దేవదాయ చట్టం ప్రకారం ఒక వ్యక్తి ట్రస్టీగా నియమితులయ్యేందుకు దేవుని పట్ల విశ్వాసము, నమ్మకం, క్రిమినల్ కేసులు లేని భక్తిభావం, దైవచింతన కలిగిన వారిని కూటమి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని కొత్త పాలకమండలి ఎంపిక ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

పంటలకు రుణ పరిమితి నిర్ధారణ : కలెక్టర్

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) ! జిల్లాలోని పలు పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమితి)ని నిర్ధారించినట్లు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(డీసీసీబీ) ఆధ్వర్యంలో జిల్లా సాంకేతిక కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యాన, పశు సంవర్థక శాఖల నుంచి పలు రుణాల మంజూరు కోసం రుణ పరిమితి వివరాలను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేపు ఉమ్మడి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల కార్యవర్గ ఎన్నికలు

ఏలూరు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీయే) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిలా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఈనెల 26న ఏలూరు జిల్లా ఖజానా అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.వి. పాండురంగారావు, కె.సత్య నారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్ వ్యవహరిస్తారు. ఉమ్మడి జిల్లాలోని ట్రెజరీ శాఖ ఉద్యోగులందరూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని కోరారు.



కాళ్లకూరు వెంకన్నన సన్నిధిలో ఎమ్మెల్యే ధర్మరాజు, చినబాబు, కాలినడక వస్తున్న నాయకులు

కాళ్లకూరు వెంకన్నకు మొక్కు తీర్చుకున్న జనసేన నేతలు

కాళ్ళ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాళ్లకూరు వేంకటేశ్వర స్వామికి జనసేన నేతలు శుక్రవారం మొక్కు చెల్లించుకున్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) జనసేన నాయకులతో కలిసి భీమవరం నుంచి కాలినడకన కాళ్లకూరు వెంకన్న సన్నిధికి చేరుకుని మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వీరికి దారి పొడవునా జనసేన నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని గడిచిన ఎన్నికల ముందు దర్శించుకుని మొక్కుకున్నామని, మళ్లీ ఇన్ని రోజులకు స్వామివారి దర్శన భాగ్యం కలిగిందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఆంధ్రరాష్ట్రం సుభిక్షంగా ఉండి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన ఉండి ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, కాళ్ళ మండలాధ్యక్షుడు ఏరుబండి రామాంజనేయులు, చెనమల్ల చంద్రశేఖర్, మేకా కాళీచరణ్, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పది మంది జూదరుల అరెస్ట్

- రూ.83,500 నగదు స్వాధీనం

పెదవేగి, జనవరి 24 (ఆంధ్ర జ్యోతి) : విజయరాయి గ్రామంలో పేకాట ఆడుతున్న సమాచారంతో దాడిచేసి పది మంది జూదరులను అరెస్టు చేశామని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.83,500 నగదు, పది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్ట్ చేసిన జూదరులను కోర్టులో హాజరుపర్చుతామన్నారు.



కాల్వలో దూకిన యువకుడిని కాపాడిన ఫైర్ అండ్ పోలీస్ సిబ్బంది

యువకుడిని రక్షించిన పోలీసులు, ఫైర్ అధికారులు

భీమవరం క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో చిన్న వంతెన పైనుంచి ఓ యువకుడు యనమదుర్రు డ్రెయిన్‌లోకి దూకాడు. పట్టణానికి చెందిన నక్కా రాజేష్ (19) వంతెనపై నడుచుకుంటూ వెళుతూ శుక్రవారం మధ్యాహ్నం కాల్వలోకి దూకాడు. సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని రక్షించే ప్రయత్నం చేశారు. తాళ్ల సాయంతో పైకి తీసుకువచ్చి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి పోలీసు స్టేషన్‌లో ఉంచారు. ఆ యువకుడు కాల్వలోకి దూకడానికి గల కారణాలు తెలియలేదు. డ్రెయిన్‌లోకి దూకిన యువకుడు పిల్లర్లను పట్టుకుని ఉండిపోవడం వల్లే ప్రాణాలు దక్కాయని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు.

ఒకటి నుంచి హెల్మెట్లు తప్పనిసరి : కలెక్టర్

ఏలూరు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు ఫిబ్రవరి 1 నుంచి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రావాల్సిందేనని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్‌తో కలిసి ఆమె రహదారి భద్రతా, రోడ్డు భద్రతా వారోత్సవాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహన చోదకుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలతో వారి కుటుంబాలకు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని దీనిని దృష్టిలో ఉంచుకుని రోడ్డు భద్రతా నియమాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. హెల్మెట్ ధారణపై మరింత విస్తృత చర్యల్లో భాగంగా తొలిగా ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు హెల్మెట్ ధరించి రావాలనే నిబంధన ఫిబ్రవరి ఒకటి నుంచి అమలు చేయాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలలకు వచ్చే వాహనదారులు హెల్మెట్ ధరించి రాకపోతే నో ఎంట్రీ అని స్పష్టం చేయాలన్నారు. ఒకటికి రెండుసార్లు తొలిగా హెచ్చరించి తదుపరి కేసులు నమోదు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సులను స్పీడ్ పరిమితి దాటి వేగంగా నడిపితే సంబంధిత ఫోన్ నంబరుకు సమాచారం అందించాలనే స్టిక్కర్లను బస్సులపై అతికించాలని ఆదేశించారు. ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరి అని లేదంటే ఎంట్రీ నిషిద్ధం అనే అంశాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో అమలు చేసి మిగిలిన ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఇన్‌ఛార్జి ఉపరవాణా కమిషనరు కేఎస్ఎంవీ కృష్ణారావు, జంగారెడ్డిగూడెం ఆర్డీవో మహ్మద్‌మదాని, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఆర్ అండ్‌బీ ఎస్ఈ జాన్ మోషే, జిల్లా ప్రజారవాణాధికారి వరప్రసాద్, మున్సిపల్ కమిషనరు ఎ.భాను ప్రతాప్, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌బీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



తాతకు తలకొరివి పెడుతున్న మనుమరాలు శరణ్య

తాతకు తలకొరివి పెట్టిన మనుమరాలు

యలమంచిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన వినుకొండ నాగేశ్వరరావు (60) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. మృతుడు నాగేశ్వరరావు కుమారుడు సుమారు నాలేగుళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. నాగేశ్వరరావు మనుమరాలు శరణ్య తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది. సుమారు 12 ఏళ్ల బాలిక శరణ్య తలకొరివిపెట్టి తాతయ్య రుణం తీర్చుకుందని గ్రామస్థులు పేర్కొన్నారు.


క్రైమ్ కార్నర్

లారీ డ్రైవర్‌కు మూడు నెలల జైలు

నూజివీడు టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి, ఇద్దరు మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు మూడునెలలు జైలుశిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ శుక్రవారం నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి తీర్పు చెప్పారు. 2020, సెప్టెంబరు 26న బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన దాసరి లెనిన్ ఆయన కుమార్తె వంజరపు శ్రీదేవి ద్విచక్రవాహనంపై మచిలీపట్నం వెళుతుండగా కానుమోలు శివారు లింగంచెరువు వద్ద వీరిని ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో లెనిన్, శ్రీదేవి తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందారు. హనుమాన్ జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేయగా, విచారణ అనంతరం న్యాయమూర్తి ఏలూరుకు చెందిన లారీ డ్రైవర్ నల్లా ప్రభాకర్‌కు మూడు నెలలు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

తెలంగాణ మద్యం పట్టివేత

కుక్కునూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజీవ్‌నగర్ గ్రామంలో 16 తెలంగాణ మద్యం సీసాలతో ఉన్న వ్యక్తిని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ శాఖ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. నాటుసారా, తెలంగాణ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సిబ్బంది హెచ్చరించారు. దాడిలో ఎస్ఐలు వెంకటలక్ష్మీ, ఎన్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



గోతిలో పడిన కారు నుంచి బాధితులను బయటకు తీస్తున్న స్థానికులు

అదుపు తప్పి కారు బోల్తా

- డ్రైవర్‌కు చికిత్స అందించిన డాక్టర్

చింతలపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మిరెడ్డిపల్లి గ్రామం వెళ్లే దారిలో ప్రగడవరం గ్రామం వద్ద మలుపు తిరుగుతున్న మారుతీకారు అదుపు తప్పి బోల్తా కొట్టి గోతిలో పడింది. ఈ ప్రమాదాన్ని చూసిన స్థానికులతోపాటు కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.కృష్ణకిషోర్ కారులో ఇరుక్కుపోయిన మతంగూడెం గ్రామానికి చెందిన సిద్ధాంతిని, డ్రైవర్‌ను బయటకు తీసి చికిత్స జరిపారు. ఆ గుంతను పరిశీలించి రోడ్డు మలుపులో తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్వాక్రా రుణాల సొమ్ము స్వాహా

- అంకన్నగూడెం పంచాయతీలో రూ.5 లక్షల వరకు చేతివాటం చూపిన సీఏ
- గిరిజన మహిళల గగ్గోలు
- బాధితుల ఫిర్యాదుతో ఏపీఎం ఘ్యూన్సీ విచారణ



దిబ్బగూడెంలో బాధిత గిరిజన డ్వాక్రా మహిళలు

జీలుగుమిల్లి, జనవరి, 24 : (ఆంధ్రజ్యోతి) : వారంతా కూలి పని చేసుకుంటూ ఎకరం, రెండెకరాల వ్యవసాయ సాగు కోసం అప్పు చేసి పెట్టుబడి పెట్టి వచ్చిన పంట ఆదాయంతో కుటుంబాల్ని నెట్టుకొస్తున్నారు. వారంతా చదువులేని అమాయకులు కావడంతో ప్రభుత్వం డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం ఇచ్చే ఉన్నతి రుణాలు వారికి తెలియకుండానే ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున బ్యాంకులో డ్వాక్రా మహిళల పేరున సీఏ టి.పవిత్ర రుణాన్ని మంజూరు చేయించింది. అనంతరం ఆ సొమ్ము తన సొంత ఖర్చులకు వినియోగించింది. కొన్ని నెలలు వాయిదాల రూపంలో బ్యాంకులకు ఆమె జమ చేసిందని తర్వాత కట్టలేని పరిస్థితిలో విషయం బయటకు వచ్చినట్లు డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. ఈ రకంగా రూ.5 లక్షల వరకు కాజేసినట్టు తెలుసుకన్న మహిళలు లబోదిబో మన్నారు. వెలుగు ఏపీఎం ఘ్యూన్సీకి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వివిరాలివి.. అంకన్నగూడెం పంచాయతీ దిబ్బగూడెంలో సంధ్య, చామంతి గ్రూపు సభ్యులైన ముచ్చిక దయామణి, చోడెం రాములమ్మ, కొవ్వాసి పార్వతి, నాగలక్ష్మి, చొడెం ముక్కమ్మ పేరున లబ్ధిదారులకు తెలియకుండా ఒక్కొక్కరి పేరున రూ.50వేలు రుణం తీసుకున్నట్లు వాపోయారు. రెడ్డిగూడెం, రామచంద్రాపురంలో కూడా ఇదే తరహాలో మరికొందరి పేరున రుణాలు కాజేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై వెలుగు ఏపీఎంకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఆమె క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. పూర్తి విచారణ జరపాల్సి ఉందన్నారు.

నా పేరున ఆన్‌లైన్ చేసి మోసగించారు



ఉన్నతి లోన్ అడగ్గా సీఎం తన పేరున ఆన్‌లైన్ చేయించింది. కొద్ది రోజుల తర్వాత రుణం మంజూరు జాబితాలో పేరు రాలేదని తెలిపింది. గుట్టుచప్పుడు కాకుండా రూ.50వేలు రుణం వాడుకుంది.

- ముచ్చిక దయామణి, సంధ్య గ్రూపు సభ్యురాలు

తెలియకుండా రుణం మంజూరు చేశారు..



నాకు తెలియకుండా నా పేరున రూ.50వేలు రుణం మంజూరు చేసి తీసుకున్నారు. కొద్ది రోజుల తర్వాత ఇతర గ్రూపు సభ్యుల ద్వారా విషయం తెలిసింది. సీఏను అడితే నెలానెలా ఆ రుణం చెల్లిస్తానని చెబుతుంది.

- చోడెం ముక్కమ్మ, చామంతి గ్రూపు సభ్యురాలు

పిట్టలోళ్ల గుడిసెలు దగ్ధం

- బైరవపట్నం సమీపంలో ప్రత్తిపాడు స్టేజీ వద్ద ఘటన
- పది మందికి గాయాలు.. అందులో ఆరుగురి పరిస్థితి విషమం

మండవల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి) : మండవల్లి మండలం భైరవపట్నం సమీపంలోని ప్రత్తిపాడు స్టేజీ వద్ద నివాసముంటున్న పిట్టలోళ్ల గుడిసెలు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి సుమారు 20 చిన్నపాటి గుడిసెలు శుక్రవారం రాత్రి దగ్ధమయ్యాయి. చేపల చెరువుపై పిట్టలు వాలకుండా కాపలాకు పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 25 కుటుంబాల వారు ప్రత్తిపాడు స్టేజి సెంటరులో తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివశిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆ గుడిసెలలో దోమల నివారణకు వెలిగించిన నిప్పు ప్రమాదానికి కారణమైందని భావిస్తున్నారు. పిట్టల కాపలా కోసం వినియోగించే గన్‌లో మందుకు నిప్పు అంటుకోవడంతో ఈ ప్రమాదం సంబవించిందని భావిస్తున్నారు. ఒక్కసారిగా గుడిసెలో పేలుడు శబ్ధం విన్పించి మంటలు చెలరేగినట్టు స్థానికులు తెలిపారు. సుమారు పది మంది వరకు గాయాలతో కైకలూరు ఆసుపత్రికి తరలించారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. వీరిలో నలుగురు పురుషులు, ఒక మహిళ, రెండేళ్ల బాలుడు ఉన్నారు. అగ్నిప్రమాద కేంద్రానికి సమాచారం ఇచ్చినప్పటికి అందుబాటులో వాహనం లేకపోవడంతో గుడిసెలు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. గుడిసెల్లో నిద్రపోతున్న వారు రోడ్డుపైకి పరుగులు తీసుకుంటూ వచ్చేశారు.



ప్రత్తిపాడు స్టేజీ వద్ద అగ్నిప్రమాదంలో కాలిపోతున్న పిట్టల వాళ్ల గుడిసెలు

తండ్రి మందుల కోసం వెళుతూ..

- వాహనం ఢీకొని కుమారుడి మృతి

మరొకరికి గాయాలు

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : తండ్రికి అనారోగ్యంగా ఉండడంతో మందుల కోసం జంగారెడ్డిగూడెం వెళ్తున్న కుమారుడు కమటం చరణ్‌తేజ్ (18)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ ఎస్‌కే జబీర్ తెలిపిన వివరాలివి.. జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన కమటం భాస్కర్‌కు అనారోగ్యంగా ఉండడంతో జంగారెడ్డిగూడెం వెళ్లి మందులు తీసుకురావడానికి కుమారుడు అతని స్నేహితుడు పెదపెట్ల సన్నీ బైక్‌పై బయలుదేరారు. జంగారెడ్డిగూడెం మండలం వేగవరం కంటి ఆసుపత్రి వద్దకు చేరుకునే సరికి గుర్తు తెలియని వాహనం నిర్లక్ష్యంగా వేగంగా నడుపుకుంటూ ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో చరణ్‌తేజ్‌కు రక్తపు గాయాలయ్యాయి. అతడి స్నేహితుడు సన్నీకి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిద్దరిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే చరణ్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. సన్నీని మెరుగైన వైద్యం నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చరణ్‌తేజ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో చోరీ

ఏలూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) జంగారెడ్డిగూడెం పట్టణంలోని మారుతీ నగర్‌లో వున్న షేక్ బాషా ఇంటి తలుపులు పగులగొట్టి లోపల ఉన్న రూ.1,52,000 విలువైన బంగారు ఆభరణాలు, రూ.2500 నగదును దొంగలు తస్కరించారని బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్‌కె. జబీర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. ఈనెల 23వ తేదీ రాత్రి షేక్ బాషా బెడ్‌రూంలో పడుకుని తెల్లవారుజామున నిద్ర లేచి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి బట్టల మధ్య పెట్టిన బంగారం, నగదు తస్కరించారన్నారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రక్తదాన శిబిరాలు

పెంటపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా విద్యార్థులు రక్తదానం చేశారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు ప్రేమ్‌సాగర్, విజయ్‌బాబు, రెడ్‌రిబ్బన్‌క్లబ్ కో ఆర్డినేటర్ కుసుమ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు లయన్స్ క్లబ్, ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శుక్రవారం రక్త దాన శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జయభారతరెడ్డి ప్రారంభించారు. ఆదిత్య విద్యాసంస్థల జిల్లా డైరెక్టర్ ఎస్వీ రాఘవరెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి అందే భాను ప్రకాష్, కోశాధికారి సురేష్, కమిటీ చైర్మన్ సత్యనారాయణ, సభ్యుల పాల్గొన్నారు. 30 యూనిట్ల రక్తం సేకరించినట్టు లయన్స్ క్లబ్ సభ్యుడు కొమ్ముల మురళీ కృష్ణ తెలిపారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు



నరసాపురం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ అవసరాలకు మించి ఎరువులు కొనుగోలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు సహకార సంఘాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, ఎవరైన కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో జాన్సన్, ఏఈవో లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

4న కోడింగ్ పోటీలు

భీమవరం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కోడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న కళాశాలలో కోడింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు చెప్పారు. పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు ఆవిష్కరించి మాట్లాడుతూ పోటీలు రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నామని, ప్రాథమిక స్థాయిలో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు, ఎక్స్‌పర్ట్ లెవల్లో మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులకు జరుగుతాయన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



భీమవరం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. స్థానిక 19వ వార్డులోని మహాత్మా గాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 140 మంది విద్యార్థులకు హౌసింగ్ బోర్డు కాలనీ వాసులు తాడికొండ కోటేశ్వరరావు రూ. 12 వేలు, పెరుమాళ్ల వెంకట రమణయ్య- భవానిల సహకారంతో రూ. 10 వేల మైక్ సెట్‌ను ఎమ్మెల్యే అంజిబాబు సమక్షంలో పాఠశాలకు అందించారు. ఎమ్మెల్యే అంజిబాబు విద్యార్థులకు టై, ఐడి కార్డ్స్, మైకు, భోజనం ప్లేట్లను, స్టాండ్స్‌ను అందించిన దాతలు తాడికొండ కోటేశ్వరరావు, పెరుమాళ్ళ వెంకట రమణయ్య, భవాని, గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, పెనుమత్స రామమోహన వర్మను అభినందించారు.

రోడ్డు భద్రతే ముఖ్యం: ఆర్టీవో నాయక్



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వేగం కంటే ప్రాణం ముఖ్యమని తాడేపల్లిగూడెం ఆర్టీవో సురేంద్ర సింగ్ నాయక్ పేర్కొన్నారు. పెదతాడేపల్లి లోటస్ స్కూల్ వద్ద రోడ్డు భద్రతా వారోత్సవాల సందరంగా బస్సు డ్రైవర్లు, క్లీనర్‌లు, విద్యార్థులకు అవగాహన కల్పించా రు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాల ఏర్పాటు

పెంటపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పశువైద్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోలా శేషవేణి, నీటిసంఘం అధ్యక్షుడు మార్కండేయులు అన్నారు. మండలంలోని దర్శిపర్రు, రాచర్ల, కోరుమిల్లి గ్రామాలలో శుక్రవారం పశువైద్య శిబిరాలను నిర్వహించారు. వైద్యులు డాక్టర్ మహేష్, డాక్టర్ సంపత్ కుమారి, డాక్టర్ క్రాంతి లు వైద్య పరిక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఉండి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చలికాలంలో వృద్ధులకు దుప్పట్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఉండి లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్సులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. శుక్రవారం కలిగొట్లలో దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ ముందుంటుందన్నారు. ఆర్థిక సాయం చేసిన గాదిరాజు అప్పలరాజును పలువురు అభినందించారు.

రోటరీ వీల్‌చైర్ వితరణ

పాలకొల్లు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో కె. స్వామి అనే యువకుడుకి శుక్రవారం వీల్‌చైర్‌ను అందించారు. క్లబ్ ప్రెసిడెంట్ రావాడ సతీష్ మాట్లాడుతూ ఆపన్నులను ఆదుకోవడంలో పాలకొల్లు రోటరీ క్లబ్ ముందుంటుందన్నారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాసు, కార్యదర్శి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ వైద్యానికి ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్: స్థానిక గుత్తుల వారిపేటలో అనారోగ్యానికి గురైన మహిళ మాలశ్రీకి మందులు నిమిత్తం యుకెఎస్ క్లబ్ గవర్నర్ పి. రామమోహన్ రూ. 5000లు ఆర్థిక సహాయం అందజేశారు. డాక్టర్ ముచ్చర్ల సంజయ్, అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపుడి కుమార్, గుండుమోగుల వీరాస్వామి, ప్రభాకర్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాలు పరిశీలన

తణుకు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆరో వార్డులో ఉన్న కమ్యూనిటీ హాలును శుక్రవారం మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పరిశీలించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాల్ పునఃనిర్మాణానికి పరిశీలించినట్లు చెప్పారు. వార్డు ఇన్‌చార్జి సిర్రా సుధాకర్ పాల్గొన్నారు.



పాలకొల్లులో బాలికా దినోత్సవం





పెంటపాడు పోస్టుబేసిక్ పాఠశాల.. మార్టేరు సెంటర్‌లో మానవహారం



కాళ్లకూరులో ర్యాలీ

బాలికలు అన్నింటా ముందుండాలి

బాలికా దినోత్సవంలో వక్తలు ▸ ర్యాలీలు, మానవహారాలు

గణపవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఆడపిల్లలను బాధ్యతగా చదివించి ఉన్నతంగా తీర్చి దిద్దాలని వక్తలు సూచించారు. శుక్రవారం గణపవరం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.తులసి, ప్రధానోపాధ్యాయులు బాలభాస్కర్ మాట్లాడుతూ బాలికల విద్య కోసం ప్రభుత్వాలు వేల కోట్లు వెచ్చిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు గంగరాజు, వైద్యాధికారి కిరణ్మయి, ఎంపీహెచ్ఓ విల్సన్‌బాబు పాల్గొన్నారు.

కాళ్ళ: జాతీయ బాలికల దినోత్సవం ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాళ్ళకూరులో సర్పంచ్ సాధు శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ దేశ భవిష్యత్ బాలికలపైనే ఆధారపడి ఉందని, బాలికల సాధికారత, సమానత్వ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

పెనుమంట్ర : బాలికలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా ప్రోత్సాహం అందించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్ టీ పోచమ్మ అన్నారు. శుక్రవారం మార్టేరు కూడలిలో ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

తణుకు రూరల్: బాలికల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కృష్ణ కుమారి చెప్పారు. వేల్పూరు, మండపాక, పైడిపర్రు జడ్పీ హైస్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థినులకు పోక్సో చట్టంపై వివరించారు. హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పెంటపాడు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పెంటపాడు పోస్టుబేసిక్ పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మానవహారం, ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు సీహెచ్. దుర్గాభవాని, జీజీబీ విజయలక్ష్మి, ఎం.సుజాత, మహిళా పోలీసులు పాల్గొన్నారు. దర్శిపర్రు ప్రాథమికోన్నత పాఠశాలలో ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.పూజిత అవగాహన కల్గించారు.

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలే భావితరాలకు వారధులని వారికి జన్మనిచ్చే వరంతోపాటు ప్రపంచాన్ని శాసించే సత్తా ఉందని ఐసీడీఎస్ పీవో టీఎల్ సరస్వతి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం డీఆర్ గోయెంకా మహిళా కళాశాల ఆవరణలో శుక్రవారం బాలికల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

మొగల్తూరు: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విరాజిత కోరారు. మొగల్తూరు నంబర్ వన్ పాఠశాల వద్ద అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. మొగల్తూరు ఐసీడీఎస్ కార్యాలయంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. సీడీపీవో బి.ఊర్మిళ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: స్థానిక 23వ వార్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం భవానీ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో బాలకలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం నిమిత్తం 2008 జనవరి 24వ తేదీ నుంచి బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు. శిశు మందిరంలో ప్రముఖ న్యాయవాది కర్రా జయసరిత బాలికలకు శుభాకాంక్షలు తెలిపి, నోట్ బుక్స్, జామెంట్రీ బాక్స్‌లు అందజేసారు.

పాలకొల్లు రూరల్: శివదేవుని చిక్కాల జడ్పీ హైస్కూల్ లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులు మానవ హారం నిర్మించారు. హెచ్‌ఎం పి.రాము మాట్లాడుతూ సమాజంలో బాలికలు విద్యావంతులై అన్ని రంగాల్లోనూ రాణించాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పితాని

ప్రజల ఆరోగ్య భద్రతకు కృషి : పితాని

పోడూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. కొమ్ముచిక్కాల క్యాంపు కార్యాలయంలో అత్యవసర వైద్యం, ఆపరేషన్లు చేయించుకున్న 8 మంది లబ్ధిదారులకు శుక్రవారం రూ.7 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో త్వరలో డయాలసిస్ సెంటరును ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాయకులు గుబ్బల అప్పన్నస్వామి, ఊడిగ శ్రీనివాసరావు, గుడిమెట్ల నరేంద్రరెడ్డి, రుద్రరాజు రవి, దొంగ సూర్యప్రసాదు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



గొల్లపల్లి బాధ్యతలు స్వీకారం

యలమంచిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి ఇన్‌చార్జ్ ఎంపీపీగా గొల్లపల్లి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.ప్రేమాన్విత ఆయనకు నియామక ఉత్తర్వులు అందించారు. వైసీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు యడ్ల తాతాజీ, మాజీ ఎంపీపీ రావూరి వెంకటరమణ, వినుకొండ ధనలక్ష్మి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



శంకుస్థాపనలో పాల్గొన్న బొలిశెట్టి, వలవల, ఈతకోట

ప్రజా సంక్షేమమే ధ్యేయం : బొలిశెట్టి

పెంటపాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కూటమి పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పడమరవిప్పర్రు నుంచి మౌంజీపాడు వరకూ రూ. 80 లక్షలతో బీటీ రహదారి నిర్మాణానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీలతో కలసి శుక్రవారం శంకుస్థాపన పూజలు నిర్వహించారు. గ్రామస్థులకిచ్చిన హామీ మేరకు రహదారిని నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. కిలపర్తి వెంకట్రావు, పుల్లాబాబి, డీసీ చైర్మన్ బండారు వెంకట్రావు, పసల అచ్యుతం, గంధం సతీష్, సర్పంచ్ తెంటు జయలక్ష్మి, పసుపులేటి అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

జనవాణిలో ప్రతి సమస్యకు పరిష్కారం



నరసాపురం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జనవాణిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ నాయకర్ అన్నారు. శుక్రవారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన జనవాణి కార్యక్రమంలో పాల్గొని వినతులు స్వీకరించినట్లు తెలిపారు. సమస్యలను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు విన్నవించేందుకు పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

ప్రతిభ గుర్తింపునకే బాలోత్సవం: ఆరిమిల్లి

తణుకు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు బాలోత్సవం దోహదపడుతుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన బాలోత్సవంలో ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ మార్పులకనుగుణంగా విద్యావ్యవస్థ కూడా మార్పు చెందేలా ఐటీ శాఖా మంత్రి లోకేశ్ అనేక మార్పులకు శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ ప్రగతి రాజా, గోపిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సాయం

తణుకు రోటరీ క్లబ్ తరపున బాలోత్సవానికి రూ. 15 వేల ఆర్థిక సాయం చెక్కును ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్ రావు చెప్పారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులకు అందించామని తెలిపారు.

స్నేహితుడి వైద్యానికి సాయం

పెనుగొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలం కొఠాలపర్రుకు చెందిన ఉండ్రాజవరపు నూకయ్య అనారోగ్యానికి గురికాగా దేవ ఎస్ఎంటీటీఆర్ జడ్పీ హైస్కూలు 1995-96 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు రూ. 1,12,000 ఆర్థిక సాయం అందజేశారు. ములపర్రు బీవీ రమణ చారిటబుల్ ట్రస్టు గౌరవాధ్యక్షులు బీవీ రమణ మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమ స్నేహితులకు కిరాణా, రైస్ బ్యాగ్‌లు అందించారు. కోశాధికారి కొల్లేపర వెంకన్నబాబు, కుడిపూడి వెంకటనారాయణ, గూడూరి చెల్లయ్య, ఇర్రింకి వెంకటేశ్వరరావు, నేలపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

పాలకొల్లు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓటుహక్కు ప్రాముఖ్యత, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈనెల 25వ తేదీ జాతీయ ఓటర్లదినోత్సవం సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు.ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు, వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో చిత్ర లేఖనం, జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పాటలు పోటీలు, తెలుగు విభాగం ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజ రాజేశ్వరి అధ్యక్షత వహించారు. కార్యక్రమలో వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంయు నిరసన

భీమవరం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని డిపో మేనేజర్ హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో పరిష్కరించకపోవటం దారుణమని ఆర్టీసి ఎన్ఎంయూ నాయకులు నిరసన తెలిపారు. శుక్రవారం రెండో రోజు కార్మికులు, నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అకారణంగా సస్పెండ్ చేసిన సూపర్వైజర్ సింగ్ , మెకానిక్ రావులను విధుల్లోకి తీసుకో వాలని డిమాండ్ చేసారు.

పరిటాలకు ఘన నివాళి

గణపవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు పరిటాల రవీంద్ర ఒక గొప్ప వ్యక్తిమాత్రమే కాదని ఆయన ఒక శక్తని గణపవరం మండల టీడీపీ అధ్యక్షుడు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా శుక్రవారం పిప్పర మండల టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్మిక నాయకుడు సింహాచలం మృతి

పాలకొల్లు అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కార్మిక నాయకుడు, స్థానిక లారీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పైలా సింహాచలం (60) గురువారం రాత్రి తన నివాసంలో మృతి చెందారు. సింహాచలంకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వామ పక్ష భావాలు కలిగిన సింహాచలం దేశ భక్తప్రజా తంత్ర ఉద్యమం (పీడీఎం) అధ్యక్షునిగా సేవలందించారు.

కర్పూరి ఠాగూర్‌కు ఘన నివాళి

భీమవరంటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బిహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న, జననాయక్ కర్పూరి ఠాగూర్ శత జయంతి సందర్భంగా శుక్రవారం మత్స్యపురిలో భీమవరం రూరల్ నాయీ బ్రాహ్మణ సంఘం, మత్స్యపురి నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా కొడవర్తి శివప్రసాద్ మాట్లాడుతూ ఠాగూర్‌కు భారతరత్న యావత్ నాయీ బ్రాహ్మణ సమాజానికి గర్వకారణమన్నారు.

వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ డిమాండ్ చేశారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం సిపాయిపేట యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సమస్యలపై చర్చించారు. సంఘ జిల్లా కార్యదర్శి పాలరాతి ఆదినారాయణ, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు తదితరులు మాట్లాడారు.

చీడపీడలు పూర్తిగా నివారించాలి

పాలకొల్లు రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి సాగులో చీడపీడలు గుర్తించి వాటిని పూర్తిగా నివారించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. శివదేవుని చిక్కాల, ఉల్లంపర్రు గ్రామాల్లోని వరి పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎంటీయూ 1426 రకం విత్తన వరి నాట్లును ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌పిఎస్ఎప్ యాప్ ద్వారా స్వయంగా రైతు పొలంలోనే చీడపురుగులను గుర్తించి ఫొటో తీసి అప్లోడ్ చేసిన వెంటనే తగు సస్యరక్షణ చర్యలు మొబైల్ లోనే వస్తాయన్నారు. పోడూరు మండలం జగన్నాథపురంలోని వరినాట్లును ఆయన పరిశీలించారు. ఈ-పంట నమోదు చేయాలని సూచించారు. పాలకొల్లు ఏడీఏ అడ్డాల పార్వతి, పాలకొల్లు రూరల్, పోడూరు మండల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

భీమవరం అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సన్మానాలే కాకుండా పంచాయతీ కార్మికులకు వేతన బకాయిలు విడుదల చేసి, ఇతర సౌకర్యాలను కల్పించాలని పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఇంటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జిల్లా సమావేశం జరిగింది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ గ్రామాల్లో బకాయిలు ఉన్నాయన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

ప్రజా ప్రతినిధులకు సమాచారమేదీ?

సర్పంచ్‌ల నిలదీత

ఆకివీడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇన్‌చార్జిల పాలన కొనసాగడమే కాక సచివాలయాల్లో కూడా సిబ్బంది లేనందున ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి సహకరించాలని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో డి.సుహాసిని, ఈవోపీఆర్డీ ఎంవీ భాస్కరరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ కఠారి జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. అజెండా లేకుండానే అభివృద్ధి అంశాలపైనే సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అధికారులు చేపట్టే పనులు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురాకుండానే నిర్వహిస్తున్నారని గుమ్ములూరు, దంపగడప సర్పంచులు కె.అనంతలక్ష్మి, ఎం.విశ్వేశ్వరరావు ప్రశ్నించారు. మత్స్యశాఖ ల్యాబ్ ఎప్పుడు వెళ్ళినా మూసి ఉంటున్నందున ఆక్వా రైతులు ప్రైవేటు ల్యాబ్‌లు వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోందని సిద్ధాపురం ఉప సర్పంచ్ ఇందుకూరి నారాయణరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులు తీసుకుంటున్నామని, చెరువులు నింపుకోవాలని అధికారులు సూచించారు. ప్రజా సమస్యలు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన ఫలితాలు ఉండడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీలు రామకృష్ణ, సూర్యనారాయణ, సూపరింటెం డెంట్ శ్రీకర్ తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

జీతాలు ఇవ్వాలని ధర్నా

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఏరియా కమిటీ కార్యదర్శి మండలపర్తి హరిష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏరియా ఆసుపత్రి వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్వో

ప్లాస్టిక్ వాడకంతో ఆరోగ్యానికి ముప్పు

భీమవరంటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలంతా నడుం బిగించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. భీమవరంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీని, మునిసిపాల్టీ, శ్రీవిజ్ఞానవేదిక, అల్లూరి సీతా రామరాజు యువజన సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో తిరుమల స్కూల్ విద్యార్థులతో కలసి నిర్వహించారు. వచ్చే నెల 1 నుంచి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నామని అన్నారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో క్యారీ బ్యాగులు, డిస్పోజల్ టీ గ్లాసులు నిషేధిస్తున్నామన్నారు. డ్వామా పీడీ వేణుగోపాల్ రావు, కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లు ర్యాలీలో మాట్లాడుతున్న ఆర్డీవో

ప్లాస్టిక్ రహిత పట్టణంగా పాలకొల్లు..

పాలకొల్లు అర్బన్: ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పాలకొల్లు పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు పట్టణ ప్రజలు, వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి, నరసాపురం ఆర్డీవో దాసి రాజు కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలో కమీషనర్ విజయ సారథి ఆధ్వర్యంలో మున్సిపల్, సచివాలయం, మెప్మా సిబ్బందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తనిఖీల్లో పట్టుబడితే భారీ జరిమానాలు విధిస్తామన్నారు. మున్సిపల్ కమీషనర్ బి విజయసారధి, మేనేజర్ నాగేశ్వరరావు, టీపీవో వీర బ్రహ్మం, డీఈ రాజ్‌కుమార్ ర్యాలీలో పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ ఆలయానికి కలెక్టర్ విరాళం

భీమవరంటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాతృమూర్తితో కలిసి శుక్రవారం మావుళ్ళమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనం అందించారు. ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. అమ్మవారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కలెక్టర్ నాగరాణి రూ.25 వేలు అందించారని ఈవో తెలిపారు.

సామాన్యులకూ అర్థమయ్యేలా త్యాగరాజ కీర్తనలు..

తణుకు: సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో త్యాగరాజ కీర్తనలు ఉంటాయని జిల్లా కలెక్టర్ చదవలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం సజ్జాపురంలోని రామకృష్ణ సేవా సమితిలో సద్గురు త్యాగరాజ ఆరాధన ప్రారంభ కార్యక్రమానికి ఆమె విచ్చేసి మాట్లాడారు. తణుకులో 86 సంవత్సరాలుగా సద్గురు త్యాగరాజ ఆరాధన సంగీత మహోత్సవాలు నిర్వహించడం అభినందనీ యమన్నారు. త్యాగరాజ ఆరాధన ఉత్సవ కమిటి అధ్యక్షురా లు చిలుకూరి లక్ష్మీ సుజాత, సెక్రటరీ జీడిగుంట శర్వాణి, ట్రెజరర్ ఇందిరా, జాయింట్ సెక్రటరీ బంక వసుంధర పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ నాగరాణి

మావుళ్లమ్మకు నగ బహూకరణ

భీమవరం టౌన్: శ్రీమావుళ్ళమ్మ అమ్మవారికి తంజావూర్‌కు చెందిన మేజర్ ఎస్. అరుణ్ దంపతులు ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా దేవస్థానం ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కు 72 గ్రాముల విలువైన బంగారు నగను అందించారు. దాతల అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.



భీమవరంలో డ్రైవర్లకు సత్కారం



తణుకులో ఆర్టీసీ డ్రైవర్ల ర్యాలీ



తాడేపల్లిగూడెంలో డ్రైవర్లకు సత్కారం

డ్రైవర్ల పాత్ర కీలకం

భీమవరం టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో డ్రైవర్ల పాత్ర కీలకమని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్ సత్యనారాయణ మూర్తి అన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 10 మంది డ్రైవర్లను సత్కరించారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వై సురేష్, సర్ సివి రామన్ స్కూల్ ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత, నిర్వాహకులు రంగసాయి ప్రసంగించారు.

తణుకు: ఆర్టీసి డ్రైవర్ల ఉద్యోగం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని ఆర్టీసి డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ అన్నారు. శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. డ్రైవర్ థ్యాంక్యూ అంటూ నినాదాలు చేసారు. సమర్థంగా విధులు నిర్వహించే వారిని అభినందించాలన్నారు. పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: ప్రయాణికులను సురక్షితంగా చేర్చే రథసారథులు డ్రైవర్‌లేనని తాడేపల్లిగూడెం పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఆర్టీసి డిపో వద్ద శుక్రవారం డ్రైవర్ల దినోత్సవం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసి డిపో మేనేజర్ వై సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్‌లను సత్కరించారు.